సాక్షి అనకాపల్లి

గురువారం । 31 । జూలై । 2025



రావిశాస్త్రికి నివాళి

ఏయూక్యాంపస్: ప్రసిద్ధ రచయిత రావిశాస్త్రి జయంతి సందర్భంగా బీచ్‌రోడ్డులోని విగ్రహం వద్ద సాహితీవేత్తలు నివాళులర్పించారు.



మోక్షారోపణ ఉత్సవాలు

కంచరపాలెం: దేవమాత మోక్షారోపణ మహోత్సవాలను ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని ఫాదర్ జాన్‌ప్రకాశ్ తెలిపారు.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం కన్నుల పండువగా జరిగింది.

రైతుల భూములపై పూలింగ్ పంజా!



మొత్తం 1941.19 ఎకరాల సమీకరణ

- రైతులకు ఇచ్చేది 900, 450 గజాలు మాత్రమే
- అసైన్డ్ భూముల హక్కులు కల్పించేలా చేసిన వైఎస్ జగన్
- ఇప్పుడు పూలింగ్ పేరుతో కాజేస్తున్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

పేద రైతులకు భూమి దక్కాలనే ఉద్దేశంతో అసైన్డ్ భూములపై సర్వాధికారాలు కట్టబెడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 20 ఏళ్లు దాటిన అసైన్‌దారులకే పూర్తి హక్కులు కల్పించేలా నిషేధిత జాబితా నుంచి ఎత్తివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఆదేశాలపై నిషేధాన్ని అమలుచేస్తోంది. గత ఏడాది కాలంగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిషేధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు ఈ నిషేధం మాటున రైతుల భూములపై పూలింగ్ పేరుతో పంజా విసిరేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు అనుగుణంగా విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలతో పాటు విజయనగరం జిల్లాలను కలుపుకుని ఏకంగా 1,941.19 ఎకరాల భూమిని పూలింగ్ పేరుతో సమీకరించేందుకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకి(వీఎంఆర్‌డీఏ) అధికారాలను అప్పగించింది. తద్వారా రైతులకు కేవలం 450 గజాల నుంచి 900 గజాలు మాత్రమే ఇచ్చి.. మిగిలిన భూమితో వ్యాపారం చేసేందుకు తయారవుతోంది. అంతేకాకుండా ఇప్పటికే కొందరు కూటమి నేతలు పూలింగ్ పేరుతో సమీకరించనున్న కొన్ని ముఖ్యమైన సర్వే నెంబర్లలోని రైతులతో ముందస్తు బలవంతపు ఒప్పందాలు చేసుకొని.. నామమాత్రంగా పైసలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే విమర్శలున్నాయి.

భూసమీకరణ పేరుతో భూకబ్జా..!

వాస్తవానికి విశాఖపట్నం సమీప ప్రాంతాల్లో భూమి ధర ఎక్కువగా ఉంది. ఎకరా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ పలుకుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో మరింతగా ధరలు పెరుగుతున్నాయి. ఇక్కడ పేద రైతులకు అనేక ప్రాంతాల్లో గతంలో అసైన్‌మెంటు కమిటీల ద్వారా పట్టాలు మంజూరు చేశారు. ఆయా భూముల్లో రైతులు సాగుచేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిషేధం ఎత్తివేయడంతో ఈ భూములను విక్రయించుకునేందుకు అవకాశం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో పేద రైతుల భూములను కాజేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అసైన్ చేసిన రైతులకు దక్కేది 900 గజాలు మాత్రమేనని పేర్కొంటోంది. ఇక పదేళ్ల కంటే ఎక్కువ కాలంగా సాగు చేసుకుంటున్న రైతులకు 450 గజాల స్థలం ఇస్తామని చెబుతోంది.

రైతులకు హక్కు దక్కకుండా...!

వాస్తవానికి 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అసైన్‌దారులకు పూర్తి స్థాయిలో వారికే హక్కులు దక్కే విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, అందులో ఏదో జరిగిపోయిందనే రీతిలో కూటమి ప్రభుత్వం ప్రచారం చేసింది. ఇప్పటికే రెండు దఫాలుగా పలువురు అధికారులతో విచారణ కూడా చేపట్టింది. ఎలాగైనా తప్పులు ఎత్తిచూపాలనే ఉద్దేశంతో ఒత్తిడి తెచ్చి మరీ విచారణ చేపట్టింది. అయినప్పటికీ ఒక్క చిన్న తప్పు కూడా జరగలేదని తేలింది. అయినప్పటికీ విశాఖలో భూములు దోచుకున్నారంటూ విషప్రచారం చేశారు. తీరా విచారణలో తేలకపోయినప్పటికీ నిషేధాన్ని మాత్రం కొనసాగిస్తూనే వస్తున్నారు. ఇప్పుడు భూసమీకరణ పేరుతో పేదల భూములను కాజేసేందుకు వీఎంఆర్‌డీఏ రూపంలో ప్రభుత్వం సిద్ధమైంది. ఒకవేళ గత ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసి ఉంటే.. రైతులకు తమకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలను విక్రయించుకునేందుకూ అవకాశం దక్కేది. ఇప్పుడు కేవలం 900, 450 గజాల స్థలానికి మాత్రమే పరిమితం కావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఏయే ప్రాంతాల్లో ఎంత భూమి అంటే...!

గ్రామం పేరు	మండలం	సర్వే నంబరు	ప్రతిపాదిత ల్యాండ్‌పూలింగ్
	విశాఖపట్నం		
గిడిజాల	ఆనందపురం	258	309.18
గోరింట	ఆనందపురం	108	198.31
శొంఠ్యాం	ఆనందపురం	347పి	251.55
బి.డి.పాలెం	ఆనందపురం	1	122.53
కొవ్వాడ	పద్మనాభం	237	250.52
	మొత్తం విస్తీర్ణం		1,132.09
	విజయనగరం జిల్లా		
మోదవలస	డెంకాడ	241, 242, 243	20.41
రావాడ	భోగాపురం	64-1	5.00
	మొత్తం విస్తీర్ణం		25.41
	అనకాపల్లి జిల్లా		
అంతకాపల్లి	సబ్బవరం	--	175.42
బాటజంగాలపాలెం	సబ్బవరం	--	141.01
ఎ.సిరసపల్లి	సబ్బవరం	--	371.75
నల్లరేగుడుపాలెం	సబ్బవరం	--	27.37
పైడివాడ అగ్రహారం	సబ్బవరం	--	28.14
తగరంపూడి	అనకాపల్లి	--	40.00
	మొత్తం విస్తీర్ణం		783.69

కన్నేసిన కూటమి నేతలు...!

ల్యాండ్ పూలింగ్ వల్ల అసైన్‌దారులు నష్టపోనున్నారు. కేవలం 450, 900 గజాల స్థలంతో సరిపెట్టుకోవాల్సి రానుంది. ఇప్పటికే కూటమిలోని కీలక నేతలకు ఏయే ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ జరగనుందనే దానిపై పక్కా సమాచారం ఉంది. దీంతో బాగా విలువైన ప్రాంతాల్లోని సర్వే నెంబర్లలో గల రైతులతో ముందస్తుగా బెదిరింపులకు దిగి.. ఒప్పందాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. 'మీ పట్టా భూములు మాకు అప్పగించండి... మీకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఇస్తామంటూ' కీలక ప్రాంతాల్లోని భూములకు సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేతో పాటు ఒక కార్పొరేషన్ చైర్మన్, ఓ మంత్రి, ఎంపీ, చినబాబులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరకు తీసుకుని పూలింగ్ పేరుతో వచ్చే 900 గజాల స్థలాన్ని కూడా కూటమి నేతలే కాజేసేందుకు రంగం సిద్ధమైంది.

న్యూస్‌రీల్

చెర్లోపల్లి ఖండం భూములకు ఎట్టకేలకు మోక్షం

- అభివృద్ధి చేసేందుకు వీఎంఆర్‌డీఏ నిర్ణయం
- అనకాపల్లిలో శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మాణం

తుమ్మపాల: అనకాపల్లి పట్టణానికి అతి సమీపంలో చెర్లోపల్లి ఖండంలో 18 ఏళ్ల క్రితం వీఎంఆర్‌డీఏ సేకరించిన భూములకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ భూముల అభివృద్ధికి ప్రభుత్వం బుధవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీపీఏ చేసుకున్న రైతులకు ఎకరాకు 1600 చదరపు గజాల నివాస స్థలం, వాణిజ్య అవసరాలకు 200 చదరపు గజాల స్థలం ఇస్తామని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని వివిధ సర్వే నెంబర్ల ద్వారా తీసుకున్న సుమారు 63 ఎకరాల్లో శాటిలైట్ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం జీవో నెం.145 ద్వారా కార్యాచరణ మొదలుపెట్టింది. గతంలో మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం రూ 110.34 లక్షలను వెచ్చించామని చెప్పారు. అంగీకారం తెలిపిన 41.287 ఎకరాల రైతులకు 1800 చదరపు గజాలు, అంగీకారం తెలపని 15.90 ఎకరాల రైతులకు ఎకరా ఒక్కింటికి 1000 చదరపు గజాల నివాస స్థలం, 200 చదరపు గజాల వాణిజ్య అవసరాలకు ఉపయోగపడే స్థలం ఇస్తామని ఆయన తెలిపారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకానికి దరఖాస్తులు

పరవాడ: ప్రస్తుత (2025-26), రానున్న (2026-27) విద్యా సంవత్సరానికి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 58 ఏళ్లలోపు వయసున్న స్కూల్ అసిస్టెంట్లలో (పీడీ, పీఈటీ) కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 31లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావును సంప్రదించాలని సూచించారు.

యథావిధిగా కిరండూల్ రైళ్ల రాకపోకలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి కోరాపుట్-కిరండూల్ మధ్య జరుగుతున్న పనులు పూర్తయినందున యథావిధిగా రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖ-కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్, కిరండూల్-విశాఖ(18516) నైట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ-కిరండూల్(58501) పాసింజర్, కిరండూల్-విశాఖ(58502) పాసింజర్ వాటి షెడ్యూల్ ప్రకారం కిరండూల్ వరకు, కిరండూల్ నుంచి రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

వాల్తేర్ డివిజన్ మొదటి క్వార్టర్‌లో 12.25 శాతం వృద్ధి

వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రా



మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రా బుధవారం దొండపర్తిలో గల డీఆర్ఎం కార్యాలయం సమావేశ మందిరంలో సరకు రవాణా ఖాతాదారులు, వ్యాపార భాగస్వాములతో సమావేశమయ్యారు. నూతన వ్యాపార పద్ధతులు, పరస్పర సహకారం, సరైన సరకు రవాణాలో మెరుగైన పద్ధతులు, శక్తివంతమైన సమాచార వ్యవస్థ వంటి విషయాల గురించి చర్చించారు. వాల్తేర్ డివిజన్ గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇంతవరకు మొదటి క్వార్టర్‌లో 12.25 శాతం వృద్ధి సాధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైజాగ్ సీ పోర్ట్, గంగవరం పోర్టు, సెయిల్, వేదాంత, ఐటీఎల్, బోత్ర, హెచ్‌బిక్యూ సర్వీస్, కేఆర్ అండ్ సన్స్, భూషణ్ పవర్, ఉత్కల అల్యూమినా, నాల్కో, కాంకోర్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, ఇండియా ఫాస్ఫేట్ లిమిటెడ్, ఆర్‌సీఐఎల్ కంపెనీల ప్రతినిధులతో పాటు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ్, సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ సందీప్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో నేడు జాబ్‌మేళా

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళా ద్వారా ఆరు కంపెనీల్లో సుమారు 200 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఏయూ కెరీర్ గైడెన్స్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 0891-2844184 నంబర్‌కు సంప్రదించవచ్చు.

జ్వరాలపై అప్రమత్తం

డీఎంహెచ్‌వో హైమావతి

నాతవరం: జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హైమవతి ఆదేశించారు. గునుపూడి పీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి, పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చే రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సకాలంలో వైద్యసేవలందించడమే ధ్యేయంగా అంకితభావంతో పనిచేయాలని వైద్యాధికారులు చంద్రశేఖర్, అనూష్, సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో జ్వరాల నియంత్రణకు ప్రణాళికలు రూపొందించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పి.జగ్గంపేటలో జ్వరాలు ప్రబలినట్టు ఫిర్యాదులు రావడంతో ఆమె స్వయంగా ఆ గ్రామంలో పర్యటించి, పరిశీలించారు. అనంతరం నాతవరం పీహెచ్‌సీ పరిధి సరుగుడు పంచాయతీలో పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. గ్రామంలో జ్వరాలు ప్రబలితే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఇప్పటికే జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న, వైద్య సిబ్బంది కె.వెంకటరమణ, పెలుపర్తి బైరాగి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



సరుగుడులో గిరిజనులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

పర్యాటకులకు సురక్షితమైన తాగునీరు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో పర్యాటకుల సౌకర్యార్థం దివీస్ లేబొరేటరీస్ రెండు ఆర్వో ప్లాంట్‌లను ప్రారంభించింది. కురుసుర మ్యూజియం, టీయు-142 యుద్ధ విమానం వద్ద ఏర్పాటు చేసిన ఈ యూనిట్లను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ పర్యాటకులకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి దివీస్ యాజమాన్యం అందించిన సహకారం మరువలేనిదన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, దివీస్ ప్రతినిధులు జీఎం వైఎస్ కోటేశ్వర రావు, సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోధనలో లోపాలుంటే చర్యలు తప్పవు

డీఈవో అప్పారావునాయుడు



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈవో

నర్సీపట్నం: విద్యా బోధనలో లోపాలుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ (మెయిన్)ను పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. నాడు-నేడు అసంపూర్తిగా నిలిచిన పాఠశాలల వివరాలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల బోధన తీరుపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు పూటలా ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు కానీ 21 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

వైఎస్ జగన్ దృష్టికి నిర్వాసితుల సమస్య

- విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూములిచ్చిన రైతులు
- నేడు పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం అష్టకష్టాలు
- అన్నదాతల ఆవేదన వివరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు రైతుల సమస్యలను వివరిస్తున్న అమర్‌నాథ్, వీసం రామకృష్ణ

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ కలిశారు. బుధవారం తాడేపల్లిలో గల క్యాంప్ కార్యాలయంలో పార్టీ అధినేతను కలిసి.. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు ఇచ్చిన నక్కపల్లి మండలం రైతులు నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం గత ఆరు నెలలుగా ఎలా పోరాడుతున్నారో వివరించారు. 2014లో భూములు తీసుకునే సమయంలో భూసేకరణ చట్టం-2013 ప్రకారం నష్ట పరిహారం, ప్యాకేజీ ఇస్తామని చెప్పి నాటి టీడీపీ ప్రభుత్వం ఎలా ఏమార్చిందో వివరించారు. ఇప్పుడు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం, అధికారులు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ప్యాకేజీ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని చందనాడ, మూలపార, తమ్మయ్యపేట రైతులు డిమాడ్ చేస్తూ ఏడాది నుంచి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నిర్వాసితుల్లో మేజర్‌లకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలియజేశారు. అంతేకాకుండా బల్క్‌డ్రగ్ పార్క్, మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం అదనంగా మరో 3,500 ఎకరాలను సేకరించడానికి పూనుకొని, కాగిత, వేంపాడు, డి.ఎల్.పురం గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేశారని, కానీ రైతులు భూములు ఇవ్వడానికి అంగీకరించడం లేదన్నారు. అదనంగా భూములు సేకరించి కార్పొరేట్ పెద్దలకు కట్టబెట్టే యత్నాలు జరుగుతున్నాయని వివరించారు. బాధితులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ తరపున పాదయాత్రలు, ఆందోళనలు చేస్తున్నామని వివరించారు. రైతుల పక్షాన పోరాటం చేయాలని, అదనపు భూసేకరణను రైతులు వ్యతిరేకిస్తే అవసరమైతే వారి తరపున పోరాటానికి తాను కూడా హాజరవుతాయని జగన్ మోహన్‌రెడ్డి చెప్పారని వారు తెలిపారు.

డీలర్లకు గుదిబండ

- ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో తంటా
- రేషన్ లబ్ధిదారులకే కాక డీలర్లకూ అవస్థలే
- ప్రజా వ్యతిరేకతతో వృద్ధులు, వికలాంగులకు ఇంటికే సరకులు అందిస్తామన్న సర్కారు
- రవాణా చార్జీలు చెల్లించకపోవడంతో డీలర్ల గగ్గోలు

నర్సీపట్నం: ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో లబ్ధిదారులతోపాటు డీలర్లు సైతం సతమతమవుతున్నారు. ప్రజల నుంచి నిరసన వ్యక్తం కావడంతో వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకే రేషన్ ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమైంది. దీంతో భారం డీలర్లపై పడింది. ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీకి కొంత మంది డీలర్లు బైక్ వినియోగిస్తుండగా, ఆర్థిక భారం తట్టుకోలేక మరికొంత మంది డీలర్లు కావిట్లో నిత్యావసర సరకులు పెట్టుకుని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో సంబరాలు జరుపుకున్న డీలర్లు ఇంటింటికీ రేషన్ భారంతో నరకం చూస్తున్నారు. వాహనాల తొలగింపు తమ పాలిటశాపంగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

డీలర్లపై ఆర్థిక భారం

జిల్లాలో మొత్తం 5,35,000 రైస్ కార్డులు ఉన్నాయి. అందులో 68 వేల మంది వృద్ధులు, వికలాంగులు ఉన్నారు. వీరికి ప్రతి నెల 25వ తేదీ నుంచి నెలాఖరులోగా ఇంటి వద్దే డీలర్లు బియ్యం, పంచదార అందించాల్సి వస్తోంది. ప్రభుత్వం రవాణా చార్జీలు ఇవ్వకపోవడంతో ఆర్థిక భారాన్ని వారే భరిస్తున్నారు. రవాణా ఖర్చులు భరించలేక కొంతమంది డీలర్లు ఐదు కేజీల చొప్పున బియ్యం సంచుల్లో ప్యాక్ చేసి, కావిట్లో తీసుకువెళ్లి లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఎండీయూ వాహనాలు ఉన్నప్పుడే తమ ప్రాణం సుఖంగా ఉండేదని డీలర్లు వాపోతున్నారు. రేషన్ బియ్యం తూకం వేసేందుకు తమ సొంత ఖర్చులతో హెల్పర్‌ను పెట్టుకుంటున్నామని, దీని వల్ల నెలకు రూ.3 వేల వరకు ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సీఎస్‌డీటీ చందన రేఖను సంప్రదించగా ఇంటింటి రేషన్ పంపిణీకి ప్రభుత్వం రవాణా చార్జీలు ఇవ్వటం లేదని, ఆ బాధ్యత డీలర్లదేనని తెలిపారు.



మాకవరపాలెం మండలం జి.నగరంలో కావిట్లో నిత్యావసర సరకులు తీసుకువెళ్తున్న డీలర్

కలెక్టర్ తీరుపై దళిత రైతుల ఆవేదన

నర్సీపట్నం: కలెక్టర్ విజయ కృష్ణన్ తీరుపై మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ అనుమతులు రద్దు చేయాలని బాధిత రైతులు ఎనిమిది రోజులుగా ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేస్తున్నారు. బుధవారం కలెక్టర్ నర్సీపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యను కలెక్టర్‌కు తెలియజేసేందుకు ప్లకార్డులతో నినాదాలు చేశారు. అయినా కలెక్టర్ ఆగకుండా వెళ్లిపోయారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర నాయకులు బొట్టా నాగరాజు, దళిత నాయకులు మట్ల చంటి, కాంగ్రెస్ జిల్లా నాయకులు బొంతు రమణ మాట్లాడుతూ కలెక్టర్ రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేసినప్పటికీ కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితుల పట్ల చులకన భావం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జిల్లాలో ఏమి జరుగుతుందో కలెక్టర్‌కు తెలియకపోడం దారుణమన్నారు.



కలెక్టర్ వస్తుండగా రోడ్డు పక్కన నిరసన తెలుపుతున్న క్వారీ బాధిత రైతులు

నేరాల నివారణకు బ్యాంకులు పటిష్ట చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ క్రైమ్ ఎస్పీ మోహన్‌రావు

అనకాపల్లి టౌన్: బ్యాంక్‌ల వద్ద చోరీల నివారణకు బ్యాంకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ (క్రైం) డి.మోహన్‌రావు సూచించారు. పట్టణ పరిధిలోని పలు బ్యాంకుల మేనేజర్లతో స్థానిక పోలీస్ అతిథి గృహంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులను పెంచాలని, వారు 24 గంటలూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్యాంక్ నుంచి ఎక్కువ మొత్తంలో ఎవరైనా నగదు విత్ డ్రాచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారికి సెక్యూరిటీ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. బ్యాంక్‌లో అనుమానితులు సంచరిస్తూ ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల్లో గతంలో జరిగిన నేరాలను ఉదహరిస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రావణి, సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐలు అల్లు వెంకటేశ్వరావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆస్పత్రికి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన అంబులెన్స్‌ను స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధాశారద, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్



సీఐ గోవిందరావు అదుపులో ఉన్న నిందితుడు మణికంఠ

నర్సీపట్నం: పోలీసులపై దాడికి యత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. కాపువీధికి చెందిన కాళ్ళ మణికంఠ(22) ఈ నెల 29న పట్టణంలో పెదబొడ్డేపల్లి జంక్షన్ వద్ద ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీసులపై రాయితో దాడికి ప్రయత్నించాడు. పరారీలో ఉన్న నిందితుడిని బుధవారం నెల్లిమెట్ట వద్ద అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వాలీబాల్ పోటీల్లో పేట విద్యార్థుల ప్రతిభ



విజయం సాధించిన విద్యార్థులు

పాయకరావుపేట: హైదరాబాద్‌లోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్‌లో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ అండర్-14 బాలుర విభాగంలో శ్రీప్రకాష్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, కోచ్‌లు విజయ్, దుర్గాప్రసాద్‌లను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, తదితరులు అభినందించారు.

'ఆ భూములను ఏపీఐఐసీకి ఎలా బదలాయిస్తారు?'

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడక పరిధిలో ఉన్న 166 ఎకరాల ఉప్పు గల్లీ భూముల్ని ఏపీఐఐసీకి ఎలా బదలాయిస్తారని వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నించారు. ఈ మేరకు పూడిమడకకు చెందిన నాయకులు చోడపల్లి అప్పారావు, వాసుపల్లి శ్రీనివాసరావు, మేరుగు చినరాజులు, చేపల శ్రీరాములు, ఉమ్మిడి జగన్, మేరుగు వసంతరావు, సూరాడ పోలయ్య, మేరుగు రమణబాబు.. డీటీ శ్యామ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 9న పంచాయతీ వద్ద రహస్యంగా నోటీసు అంటించి, ఎటువంటి దండోరా వేయకుండా భూబదలాయింపు చేయడం దారుణమన్నారు. తక్షణమే గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్తుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

అప్పన్న సన్నిధిలో.. వసతి కష్టాలు!

సింహగిరిపై వసతి కోసం భక్తులు తిప్పలు పడాల్సి వస్తుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై **కనీసం ఒక్క** రోజైనా బస చేసి, ఆధ్యాత్మిక సం**తృప్తి** పొందుదామంటే అందుకు వీల్లేని **దుస్థితి.** ఇక్కడ సామాన్య భక్తులకు అందు**బాటు** ధరలో ఉన్నది దేవస్థానానికి చెంది**న గజపతి** సత్రం మాత్రమే. అది కూడా వారాం**తపు** రోజులు, పర్వదినాలు, పెళ్లిళ్ల సమ**యంలో** దొరకని పరిస్థితి. దీంతో ప్రైవేట్ **హోటళ్లు,** లాడ్జీల్లో బస చేసి, చేతి చమురు **వదిలించుకో**వాల్సి వస్తోందని భక్తులు వాపో**తున్నారు.**

- అందుబాటులో ఉన్నది గజపతి సత్రం ఒక్కటే
- పెళ్లిళ్లు, ఉత్సవాలు, యాత్రా దినాల్లో గజపతి సత్రం ఫుల్
- వీఐపీలకూ దొరకని వీఐపీ కాటేజీలు
- మరుగున పడ్డ డొనార్స్ కాటేజీ ప్రణాళిక



ప్రస్తుతం అందుబాటులో ఉన్న గజపతి సత్రం



వీఐపీల కోసం ఉన్న ప్రహ్లాద కాటేజీ



వీఐపీల సింహవల్లీ, రమణారెడ్డి కాటేజీలు

సింహాచలం: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటి సింహగిరి పైనున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం. స్వామి దర్శనానికి రోజూ వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. వీరిలో కుటుంబ సమేతంగా వచ్చే దూర ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ. సింహగిరికి చేరుకున్నాక తాత్కాలిక బసకు గదులు దొరకడం గగనమైపోయింది. దీనికి కారణం సరిపడా కాటేజీలు సింహగిరిపై లేకపోవడమే..! సింహగిరిపై భక్తులకు సరిపడా వసతి కల్పించాలని ఇటీవల ఆలయానికి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి కూడా పలువురు తీసుకెళ్లారు.

గజపతి సత్రం ఒక్కటే దిక్కు

సింహగిరిపై ప్రస్తుతం గజపతిసత్రం ఒక్కటే భక్తుల వసతికి అందుబాటులో ఉంది. రెండు అంతస్తుల్లో ఉన్న ఈ సత్రంలో 24 ఏసీ, 24 నాన్ ఏసీ గదులున్నాయి. జీఎస్టీతో కలిపి ఏసీ అయితే రూ.1,008, నాన్ ఏసీ అయితే రూ.560 చెల్లించాలి. శని, ఆదివారాలు, యాత్రా రోజులు, పెళ్లిళ్ల సీజన్లలో ముందుగా బుక్ చేసుకునేవి ఈ గదులే. దీంతో సామాన్య భక్తులకు గదులు లభించడం కష్టతరమవుతోంది. గంటల తరబడి నిరీక్షించినా ఫలితంలేక నిరాశగా వెనుదిరగాల్సి వస్తోందని భక్తులు తరచూ వాపోతున్నారు.

వీఐపీ కాటేజీల పరిస్థితీ అంతే..

సింహగిరిపై ఉన్న వీఐపీ కాటేజీల పరిస్థితి కూడా దాదాపు అంతే. ప్రస్తుతం వీఐపీ కేటగిరీకి చెందిన ప్రహ్లాద, సింహవల్లీ, రమణారెడ్డి, అన్నపూర్ణ, వీబీసీ కాటేజీలు సింహగిరిపై ఉన్నాయి. ప్రహ్లాద కాటేజీలో మూడు సూట్ రూమ్‌లకు కలిపి అద్దె రూ.3,920. సింహవల్లీ, రమణారెడ్డి కాటేజీల్లో రెండేసి సూట్లు ఉండగా, ఒక్కో సూట్‌కు రూ.1120, అన్నపూర్ణ, వీబీసీలో రెండేసి సూట్‌లుండగా ఒక్కో సూట్‌కు రూ.2,800 చెల్లించాలి. కొంచెం ఆర్థిక స్తోమత కలిగిన వారు ఆ కాటేజీల్లో బస చేద్దామంటే సవాలక్ష నిబంధనలు సతాయిస్తాయి. ఆ సమయానికి మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు, ఉన్నతాధికారుల బస చేయకపోతే, వారి సిఫార్సుతో మరెవరూ లేకపోతే తప్ప ఆ కాటేజీలు లభించవు.

మరుగున పడ్డ డొనార్స్ కాటేజీ ప్రణాళిక

సింహగిరిపై సాధారణ భక్తులకు, వీఐపీలకు అందుబాటులో ఉండేలా డొనార్స్ కాటేజీ నిర్మాణానికి 2008లో ప్రణాళిక చేశారు. మైక్రోటవర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న కొండపై వీఐపీ కాటేజీల నిర్మాణానికి అప్పటి ఈవో, ప్రస్తుత దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సంకల్పించారు. డొనార్స్ కాటేజీ నిర్మాణానికి కొండపై కొంతమేర స్థలాన్ని చదును చేశారు. రామచంద్రమోహన్ బంధువే తొలి విరాళాన్ని అందించారు. ఒక్కో డోనార్‌కు ఒక్కో గది పేరు పెట్టి ఏడాదిలో నెల రోజులు వారికి ఉచితంగా ఆ గదిని ఇచ్చేందుకు నిర్ణయించారు. కానీ కొన్ని రోజులకే ఆ ప్రణాళిక మరుగున పడింది.

ఉత్సవ రోజుల్లో బుకింగ్ బంద్

సింహగిరిపై జరిగే చందనోత్సవం, వార్షిక కల్యాణోత్సవం, గిరి ప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి తదితర ప్రముఖ ఉత్సవాల రోజుల్లోనైతే భక్తులు బస కోసం ఆశలు వదులుకోవాల్సిందే. ఆయా రోజుల్లో దేవస్థానమే ముందుగా గజపతిసత్రంలోని గదులను అద్దెకు కేటాయించే ప్రక్రియని నిలిపేస్తుంది. ఆ రోజుల్లో విధులకు హాజరయ్యే పలు ప్రభుత్వ సంస్థల సిబ్బందికి, ఇతరత్రా అవసరాలకు ఆ గదులను కేటాయిస్తుంది.

వసతి సౌకర్యం పెంచాలి



ఉత్తరాంధ్రలో ఎంతో పెద్ద క్షేత్రం అయిన సింహాచలానికి వచ్చే భక్తులకు వసతి సౌకర్యం పెంచాల్సిన బాధ్యత దేవస్థానం అధికారులపై ఉంది. ముఖ్యంగా కనీసం ఒకరోజైనా ఇక్కడ ఉండేలా వసతి సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– రవితేజ, పార్వతీపురం

అయ్యన్న తీరు అనుమానాస్పదం

- **రాజ్యాంగ** హోదాను **అవహాస్యం** చేస్తున్నారు
- **స్పీకర్ రోడ్డెక్కి** లారీలు ఆపడమేంటి ?
- **అన్ని కంపెనీల** విషయంలోనూ ఇలాగే స్పందిస్తారా
- **ప్రశ్నించిన** మాజీ ఎమ్మెల్యే **ఉమాశంకర్** గణేష్



నర్సీపట్నం: రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు ఆ పదవి హుందాతనాన్ని దిగజార్చుతున్నారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శాసన సభ్యుడిగా గెలిచి, స్పీకర్ పదవిలో ఉన్న అయ్యన్నపాత్రుడు రోడ్డెక్కి లారీలు ఆపడం ఏంటని ప్రశ్నించారు. పట్టుకున్న ఓవర్‌లోడు లారీలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించకుండా..ఓనర్లు తన వద్దకు వచ్చే వరకు వదలొద్దంటూ పోలీసులను హెచ్చరించడం మరీ హాస్యాస్పదంగా ఉందన్నారు. పొట్ట కూటి కోసం పని చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్ల పట్ల స్పీకర్ నోరు పారేసుకోవడం ఆయన స్థాయికి తగదన్నారు. మాకవరపాలెం మండలంలో ఉన్న పయనీరు అల్యూమినియం కంపెనీని లక్ష్యంగా చేసుకుని ఆ కంపెనీకి ముడి సరుకు రవాణా చేస్తున్న లారీలను ఆపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటన్నది స్పీకర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అల్యూమినియం కంపెనీకి ముడి సరుకు రవాణా చేస్తున్న లారీలను లక్ష్యంగా చేసుకుని అధిక లోడు పేరుతో ఆయన తరచూ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రోడ్లు, వంతెనలు దెబ్బతినకుండా ఉండాలంటే అధిక లోడ్‌తో వెళ్లే అన్ని వాహనాలను ఆపితే ప్రజలు హర్షిస్తారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మైనింగ్ జరుగుతోందని, క్వారీల నుంచి టిప్పర్లతో టన్నుల కొద్దీ రాయిని ఇదే రోడ్డులో తరలిస్తున్నారని చెప్పారు. స్పీకర్‌కు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. కేవలం అల్యూమినియం కంపెనీకి వెళ్తున్న లారీలను లక్ష్యంగా చేసుకుని ఆపడమనేది పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. రాత్రీ పగలు అన్న తేడాలేకుండా నర్సీపట్నం మీదగా రాంబిల్లిలోని నేవల్ బేస్‌కు రాకపోకలు సాగిస్తున్న అధిక లోడు లారీలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నర్సీపట్నం మీదగా నిత్యం రాకపోకలు సాగిస్తున్న లారీలను స్పీకర్ ఎందుకు ఆపడం లేదన్నారు. స్పీకర్ స్థానాన్ని అగౌరవ పరిచే విధంగా అయ్యన్నపాత్రుడు వ్యవహరించడం రాజ్యాంగ హోదాను అపహాస్యం చేయడమేనని మాజీ ఎమ్మెల్యే గణేష్ తెలిపారు.

రోడ్డు కోసం యూకలిప్టస్ తోట ధ్వంసం

- పరిహారం చెల్లించాలని అడ్డుకున్న పీతపాలెం రైతులు
- చేసేది లేక వెనుదిరిగిన తహసీల్దార్, పోలీసులు



పరిహారం చెల్లించాలంటూ నిరసన చేస్తున్న రైతులు



రైతులు సాగులో ఉన్న యూకలిప్టస్ తోటను ధ్వంసం చేస్తున్న పొక్లెయిన్‌లు

తుమ్మపాల: పరిహారం చెల్లించకుండా సాగులో ఉన్న యూకలిప్టస్ తోటను పోలీసు బందోబస్తు నడుమ ధ్వంసం చేయడాన్ని రైతులు అడ్డుకున్నారు. మండలంలో కోడూరు సర్వే నంబర్ 1/1 ప్రభుత్వ భూమిలో సబ్బవరం మండలం పీతపాలెం గ్రామానికి చెందిన రైతులు పూర్వం నుంచి సాగులో ఉన్నారు. సమీపంలో కలెక్టర్ బంగ్లాతో పాటు ఉన్న ఆటోనగర్, ఎంఎస్ఎంఈ పార్క్‌కు పీతపాలెం, పైడివానిపాలెం మీదుగా అనకపల్లి వద్ద జాతీయ రహదారికి 100 అడుగుల రోడ్డు అభివృద్ధి చేయాల్సి ఉంది. పీతపాలెం వద్ద కోడూరు రెవెన్యూ పరిధిలో రైతుల సాగులో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమి మధ్యలోంచి సుమారు 1.54 ఎకరాల్లో 100 అడుగుల వెడల్పున రోడ్డుకు ఏపీఐఐసీ కేటాయింపులు చేసింది. ఈ మేరకు మొదలుపెట్టిన పనులను కొద్ది రోజులుగా రైతులు అడ్డుకున్నారు. అయితే బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు, రెవెన్యూ సిబ్బంది రూరల్ పోలీసులు బందోబస్తు నడుమ బుల్డోజర్లు, పొక్లెయిన్లతో తోటను ధ్వంసం చేశారు. అనంతరం చదును చేసే పనులకు పూనుకున్నారు. రైతులు స్థానిక నాయకులతో కలిసి పనులను ఆపేశారు. నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేపడితే సహించమని రైతులు తేల్చి చెప్పడంతో పనులు నిలిపివేసి అధికారులు వెనుతిరిగారు.

బల్క్ డ్రగ్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం



రాజయ్యపేటలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, నాయకులు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో నిర్మించతలపెట్టిన బల్క్ డ్రగ్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రద్దుచేయాలని మత్స్యకారులు, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయణ సేకరణ నిర్వహిస్తే అడ్డుకుంటామని చెప్పారు. బల్క్ డ్రగ్‌పార్క్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం రాజయ్యపేటలో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు , వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరిపల్లి నాగేశు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన ఈ బల్క్ డ్రగ్‌పార్క్‌ను ప్రజలు, మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. వచ్చే నెల ఆరోతేదీన నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను రద్దుచేయాలంటూ నినాదాలు చేశారు. కూటమిప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం కంటే పారిశ్రామికవేత్తల ప్రయోజనాలే ముఖ్యమన్నారు. కంపెనీలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని చెబుతూ రైతులనుంచి వేలాది ఎకరాలు లాక్కొంటున్నారన్నారు. కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని తెలిపారు. స్కిల్‌డవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హోంమంత్రి అనిత చెబుతున్నారని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు పునాది రాయికూడా వేయలేదని తెలిపారు. బల్క్‌డ్రగ్‌పార్క్ కోసం ఇప్పటికే రెండు వేల ఎకరాలు కేటాయించారని, అదనంగా మరో ఎనిమిది వందల ఎకరాలు కేటాయించేందుకు భూసేకరణ కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రైతులకు తెలియకుండా 6ఏ నోటీసులు జారీ చేశారని తెలిపారు. ప్రజాభిప్రాయసేకరణను అడ్డుకుని తీరుతామన్నారు.ఈ ఆందోళనలో మనబాల రాజేష్, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు బండారు క్షమాపణ చెప్పాలి

- అదానీ హైడ్రో పవర్ ప్లాంట్లను రద్దు చేసినట్టు వక్రీకరించడం తగదు
- గిరిజనులను తప్పుదోవ పట్టించడం సరికాదు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న ధ్వజం



రైవాడ జలాశయం వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: చింతలపూడి, పెదకోట ఏరియాలో అదానీ హైడ్రో పవర్ ప్లాంట్‌లకు ప్రభుత్వం అనుమతులు రద్దు చేసినట్టు ఈ ప్రాంత గిరిజనులు, రైవాడ ఆయకట్టు రైతులను తప్పుదోవ పట్టించేలా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రకటనలు చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న విమర్శించారు. రైవాడ జలాశయం వద్ద బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రైవాడ జలాశయం నీటిని విడుదల చేసిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ దేవరాపల్లి మండలం చింతలపూడి, అనంతగిరి మండలం పెదకోట సమీపంలో నిర్మించబోయే అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను ప్రభుత్వం రద్దు చేస్తూ జీవో జారీ చేసిందని చెప్పడాన్ని ఖండించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా అసత్య ప్రకటనలు చేసిన ఎమ్మెల్యే బండారు ఆయా ప్రాంతాల గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైవాడ క్యాచ్‌మెట్ ఏరియాలో అదానీ హైడ్రో పవర్ ప్లాంట్‌లకు అనుమతులు ఇచ్చి రైవాడ ఉసురు తీస్తున్నారని, దీనికి స్థానిక ఎమ్మెల్యే బండారు పూర్తి బాధ్యత వహించాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కర్రివలస, కురుకుట్టి గ్రామాల పరిధిలో అదానీ హైడ్రో పవర్ ప్లాంట్‌లకు గతంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 28న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు దీనిని వక్రీకరించి చింతలపూడి సమీపంలోని మారిక, పెదకోట సమీపంలోని రేగులపాలెం ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసినట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందని చెప్పారు. రైవాడ జలాశయానికి ఎక్కడ నుంచి నీరు వస్తుందన్న విషయం తెలియక కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మన్యం జిల్లాలో హైడ్రో పవర్ ప్లాంట్‌లను రద్దు చేశారని, ఇక్కడ గిరిజనుల భవిష్యత్ అంధకారంగా మారుతున్నా ఎంపీ సి.ఎం.రమేష్, ఎమ్మెల్యే బండారు నోరుమెదపకపోవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ పవర్ ప్రాజెక్టులు నిర్మాణం జరిగితే రైవాడ ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు.

'అతిథి' ఇంటర్వ్యూల్లో వింత పోకడ!

- గతంలో సిక్స్‌మెన్ కమిటీ
- ఇప్పుడు ఫోర్‌మెన్ కమిటీ
- ఎంపిక కమిటీలో ప్రిన్సిపాళ్లకు దక్కని చోటు

మద్దిలపాలెం: వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్రా యూనివర్సిటీలో అతిథి అధ్యాపకుల భర్తీ ప్రక్రియ వింత పోకడలకు దారి తీస్తోంది. ఇంటర్వ్యూ కమిటీ కూర్పులో మార్పులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో సిక్స్‌మెన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు జరిగేవి. ఈ కమిటీలో విభాగాధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, సబ్జెక్ట్ నామినీలతో పాటు మరో కళాశాల ప్రిన్సిపాల్ ఉండేవారు. అయితే ఇప్పుడు కొత్తగా ఫోర్‌మెన్ కమిటీని ప్రవేశపెట్టారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. కొత్త కమిటీలో విభాగాధిపతి, బీవోఎస్ చైర్మన్, ఫ్యాకల్టీ చైర్మన్, ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లను నియమించినట్లు భోగట్టా. ఇంతకుముందు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన కళాశాల ప్రిన్సిపాల్ ఇంటర్వ్యూ ప్రక్రియలో భాగమయ్యేవారు. ఇప్పుడు ప్రిన్సిపాళ్లను కొత్త కమిటీ నుంచి తొలగించడం వర్సిటీ వర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది. వందేళ్ల వర్సిటీ చరిత్రలో ఇంత వింత పోకడలను ఎన్నడూ చూడలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలు గందరగోళంగా, అయోమయంగా మారాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఏయూలో అతిథి అధ్యాపకుల నోటిఫికేషన్‌తో మొదలైన వివాదం ఇప్పుడు ఇంటర్వ్యూల్లో కొత్త విధానంతో మరో మలుపు తిరిగింది. ఉన్నత విద్యామండలి పరిధిలో ఏ వర్సిటీలోనూ ఇలాంటి విధానం అమలు చేయనప్పుడు, ఇక్కడే ఎందుకు అమలు చేస్తున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.

బస్సుల కండిషన్ పరిశీలన

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కోసం బస్సులను కండిషన్‌లో ఉంచాలని ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి వి.ప్రవీణ అన్నారు. అనకాపల్లి డిపో గ్యారేజీలో బుధవారం మెకానిక్ సిబ్బందితో సమావేశం నిర్వహించి, బస్సుల కండిషన్‌పై ఆరా తీశారు. స్వయంగా బస్సులో ప్రయాణించారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు రిజిస్ట్రేషన్

అనకాపల్లి: సుబ్రోతో ముఖర్జీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సుబ్రోతో ముఖర్జీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్–2025కు ఆగస్టు 14వ తేదీ లోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి ఎల్.వి.రమణ బుధవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఒక్కొక్క స్కూల్ నుంచి రూ.2 వేలు చెల్లించి అండర్ –15, 17 బాలబాలికల విభాగంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బెంగుళూర్, ఢిల్లీలో సెలక్షన్ పోటీలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు www.rubsothocup.com వెబ్ సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

జీవీఎంసీ వాహనాలకు జీపీఎస్ వ్యవస్థ పటిష్టం

మహారాణిపేట: జీవీఎంసీ వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను పటిష్ట పరచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ మెకానికల్ పర్యవేక్షక ఇంజనీర్ జి.గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ ఎ.రత్నాకర్ రెడ్డి, మెకానికల్ అడ్వైజర్ ఎం.కె.సాయిబాబు, ఫాస్ట్ ఫార్వర్డ్ టెక్నికల్ టీమ్ వి.సుధీర్, ఎంట్రో ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.సురేంద్రలతో కలిసి సమీక్ష నిర్వహించారు. నిర్ణీత సమయంలో వాహనాలు విధుల్లో ఉండాలని, విధుల్లో ఉన్న వాహనాలు నిలిపివేయడం గాని, దారి మళ్లించడం గాని చేయరాదన్నారు. అధికారులకు కేటాయించిన వాహనాల వివరాలు డిజిటల్ విధంగా చూపించాలని, ఎలాంటి హోదా కలిగిన అధికారులు వాహనాలను వినియోగిస్తున్నారో ట్రాక్ చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను పటిష్ట పరచడం వల్ల వాహనాల పనితీరును గమనించవచ్చన్నారు. వాహన డ్రైవర్ల లాగ్ బుక్, మెయింటెనెన్స్, మరమ్మత్తులు, మైలేజీలను ఎప్పటికప్పుడు డిజిటల్ రూపంలో పొందుపరచాలని ఆదేశించారు. పారిశుధ్యం వాహనాలకు ప్రత్యేకించి రూట్ మ్యాప్‌ను రూపొందించి, అవి సక్రమంగా వెళ్తున్నాయా లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారా అని పరిశీలించాలన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామానందం

అనకాపల్లి: జిల్లాలో వివిధ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, బీసీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రిన్సిపాల్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.రామానందం తెలిపారు. స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల ఆవరణలో జిల్లాలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది జిల్లాలో ఎస్సీ విద్యార్థులు 2,800 మంది, బీసీ విద్యార్థులు 32,000 మంది ఉన్నారని, ఈ ఏడాది కొత్తగా కళాశాలల్లో జాయిన్ అవుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆ గొయ్యి బలిగొంది.. వివాహ బంధాన్ని తెంచేసింది

టాలర్ చక్రాల కింద పడి సినర్జీస్ ఉద్యోగి మృతి



ఘటనా స్థలంలోనే మృతి చెందిన సినర్జీస్ ఉద్యోగి రాహుల్

కూర్మన్నపాలెం: 'ఇంకొద్ది సేపట్లో ఇంటికి వస్తున్నా..' అని చెప్పి బయలుదేరిన ఆ యువకుడి మాటలే చివరివయ్యాయి. విధులకు వెళ్లిన భర్త తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న ఆ నవ వధువుకు తీరని శోకం మిగిలింది. కళ్లెదుటే భవిష్యత్తు బంగారంగా కనిపిస్తుండగా.. రహదారిపై ఉన్న గొయ్యి ఆ కుటుంబాన్ని ఛిద్రం చేసింది. ఒక ఇంజినీర్ నూరేళ్ల జీవితాన్ని బలిగొంది. సినర్జీస్ సంస్థలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాహుల్‌కు ఈ ఏడాది మేలోనే వివాహం జరిగింది. భార్య, తండ్రితో కలిసి జీవీఎంసీ 87వ వార్డు కణితికాలనీలోని వైష్ణవి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. రోజూలాగే బుధవారం కూడా విధులను ముగించుకుని తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. దువ్వాడ సమీపంలోని రాజీవ్‌నగర్ వద్ద రహదారిపై ఉన్న ఓ గొయ్యి రూపంలో మృత్యువు కాపు కాసింది. ఆ గొయ్యిని తప్పించే చిన్న ప్రయత్నంలో రాహుల్ అదుపుతప్పాడు. బైక్‌పై నుంచి కింద పడి.. వెనకనే వస్తున్న భారీ ట్రాలర్ చక్రాల కింద నలిగిపోయాడు. అక్కడికక్కడే కన్నుమూశాడు. కొద్ది నిమిషాల్లో ఇంట్లో ఉండాల్సిన రాహుల్.. రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉన్న దృశ్యం చూపరుల హృదయాలను కలచివేసింది. ఈ వార్త తెలియగానే ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తన కుమారుడు నేల మీద నిర్జీవంగా పడి ఉండటాన్ని చూసి ఆ తండ్రి గుండెలవిసేలా రోదించాడు. అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఉన్న ఆ గొయ్యి.. ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. రాహుల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ మల్లేశ్వరరావు నేతృత్వంలో ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

14న రాజమాతంగేశ్వరి యాగం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కేఎస్ఆర్‌పేట జాతీయ రహదారి రాజుపాలెం రోడ్డులోని లలితాదేవి పీఠంలో వచ్చే నెల 14న 'రాజమాతంగేశ్వరి యాగం' యాగం నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు ఎం.రాధాకృష్ణ శర్మ బుధవారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. అదే రోజు గణపతి పూజ స్వస్తి పుణ్యాహవాచనం, రక్షాబంధన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాజమాతాంగేశ్వరీ యాగం, పూర్ణాహుతి హోమం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధ ఉంటుందని పేర్కొన్నారు.

3న సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ సత్తెమ్మతల్లి ఆలయ 34వ వార్షికోత్సవం వచ్చే నెల 3వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు మద్దాల సీతారాం, కార్యదర్శి కాండ్రేగుల భీమేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, 10న మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు, 13న అమ్మవారి జాతర కార్యక్రమం జరుగుతుందన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి-1, 2 పరిధిలో శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు మరమ్మతులు నిమిత్తం సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ (ఆపరేషన్) ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో 11 కేవీ పరిధిలో గాంధీనగరం, గవరపాలెం ఇండోర్ స్టేడియం, లక్ష్మీనారాయణనగర్, పూల్‌బాగ్ రోడ్డు, గాంధీమార్కెట్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బంది

కశింకోట: కశింకోట ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరాకు రెండు గంటలపాటు అంతరాయం కలిగింది. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 5 గంటల ప్రాంతంలో పునరుద్ధరణ అయింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. బ్రేక్ డౌన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని సిబ్బంది తెలిపారు.

ఎన్టీపీసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు

పరవాడ: మండలంలో వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం తారకరామ కాలనీలో ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే శివారు గ్రామం పోలిరెడ్డిపాలెం ప్రజలకు అనేక విధాల సౌకర్యంగా ఉంటుందని, నిధులు మంజూరు చేసిన ఎన్టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 73 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,480	4,500
రెండో రకం	3,500	3,550
మూడోరకం	3,100	3,450

అనకాపల్లి సినిమాలు

రాజా
:హరిహర వీరమల్లు
సత్యనారాయణ స్క్రీన్-1: కింగ్ డంమ్
సత్యనారాయణ స్క్రీన్-2: హరిహర వీరమల్లు
పర్తిసాయి : హరిహర వీరమల్లు
షిర్డీసాయి : హరిహర వీరమల్లు
వెంకటేశ్వర : హరిహర వీరమల్లు
శ్రీ సత్య : తమ్ముడు
రామచంద్ర : హరిహర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 74 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-25, ఓ పాజిటివ్-37 , ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

జ్వరాలతో విలవిల



తాళ్లపాలెంలో సిద్ధమైన బ్లాక్ హెల్త్ పబ్లిక్ యూనిట్ భవనం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది





కశింకోట పీహెచ్‌సీ ప్రాంగణంలో గడ్డి, తుప్పలు ఎదిగి ఉన్న ప్రాంతం



వైద్య సేవల కోసం రోగుల నిరీక్షణ

కశింకోట: వాతావరణ మార్పులతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏ ఇంటి తలుపు తట్టినా జ్వర పీడుతులే కనిపిస్తున్నారు. ప్రధానంగా విష జ్వరాలతో బాధపడుతున్నారు. దాంతో మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వ్యాధిగ్రస్తులతో నిండిపోతున్నాయి. రోజుకు 25 మంది వరకు వైద్య సేవలకు వస్తున్నారు. దీంతో సాధారణ రోగులతోపాటు వీరు తోడు కావడంతో పీహెచ్‌సీలు కిటకిటలాడుతున్నాయి. కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు వైద్య సేవలందిస్తున్నాయి. మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో రోగులు సేవలు పొందుతున్నారు. కశింకోట పీహెచ్‌సీ పరిధిలో అదనంగా అనకాపల్లి మండలంలోని కొత్తూరు, సత్యనారాయణపురం, సంపతిపురం, పిసినికాడ తదితర గ్రామాల ప్రజలు సేవలు పొందుతున్నారు. ఇవి 70 వేల జనాభాకు ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం కశింకోట పీహెచ్‌సీకి రోజుకు వంద మంది, తాళ్లపాలెం పీహెచ్‌సీకి రోజుకు 70 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీలో సోమవారం రోజు అక్కడ సంత కావడంతో ఈ సంఖ్య వందకు పైగా చేరుతోంది.

వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధిగ్రస్తులు

గత కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో సీజనల్ వ్యాధిగ్రస్తులు ఎక్కువయ్యారు. ప్రధానంగా జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, విరోచనాలు తదితర వ్యాధులతో వస్తున్నారు. ఇలాంటి వారు ఒక్కొక్క పీహెచ్‌సీకి 25 మంది వరకు వస్తున్నారు. వాతావరణంలో మార్పులు కావడం వల్ల ఈ పరిస్థితి ఉందని వైద్యులంటున్నారు. వీటి పరిధిలో వెల్‌నెస్ సెంటర్లలోనూ సీజనల్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. రెండు పీహెచ్‌సీల్లో ఇద్దరు వంతున వైద్యులు పని చేస్తున్నారు. వారిలో ఒకరు కేంద్రంలో సేవలందిస్తూ మరొకరు గ్రామాల్లో ఫ్యామిలీ కాన్సెప్ట్ శిబిరాల ద్వారా సేవలందిస్తున్నారు.

భయంకరంగా కశింకోట పీహెచ్‌సీ ప్రాంగణం

కశింకోట పీహెచ్‌సీ ప్రాంగణంలో గడ్డి, తుప్పలు పెరిగి భయంకరంగా ఉంది. దీంతో విష పురుగులు, సర్పాలకు నిలయంగా మారుతుండటంతో కేంద్రానికి వచ్చే రోగులు భయాందోళన చెందుతున్నారు. ఏ క్షణాన్న ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన చెందుతున్నారు. దీన్ని శుభ్రం చేసి చుట్టూ మట్టి నింపడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కేంద్రం పరిధిలో 13 వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఏడు కేంద్రాలకు భవనాలున్నాయి. బయ్యవరం, కొత్తపల్లి, వెదురుపర్తి కేంద్రాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటిలోనే వెల్‌నెస్ సెంటర్లు కొనసాగించాల్సి వస్తోంది.

పలు పోస్టులు ఖాళీగానే ..

కశింకోట, సత్యనారాయణపురంలలోని వెల్‌నెస్ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇటీవల సిబ్బంది బదిలీలు కావడంతో హెల్త్ సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏడు నెలలు పైబడి మూడు పోస్టుల్లో ఒక స్టాఫ్‌నర్స్ పోస్టు ఖాళీగా ఉంది. తాళ్లపాలెం పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్, హెల్త్ విజిటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ కేంద్రం ప్రాంగణంలో రూ.50 లక్షలు వెచ్చించి వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన బ్లాక్ హెల్త్ పబ్లిక్ యూనిట్ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. దీనిలో రక్త పరీక్షల నిర్వహణ చేపడతారు. ఇప్పటి వరకు పీహెచ్‌సీ భవనంలో రక్త పరీక్షల యూనిట్‌ను దీనిలోకి మార్పు చేస్తారు. రోగులకు దీనిలో విరివిగా పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కేంద్రం పరిధిలో 11 వెల్‌నెస్ కేంద్రాల్లో జి. భీమవరం, ఉగ్గినపాలెం, తీడ గ్రామాల్లో సొంత భవనాల్లో సేవలందిస్తున్నారు.



తాళ్లపాలెం పీహెచ్‌సీలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి మనీషా



కశింకోట పీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ యశోద

గోకివానిపాలెంలో భవనం నిర్మాణం దాదాపు పూర్తి అయినప్పటికి ఇంకా ప్రారంభం కావలసి ఉంది. మిగిలిన చోట భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్య సేవలందిస్తున్నాం

సీజన్ కావడం వల్ల సీజనల్ వ్యాధుల్లో వైరల్ జ్వరం కేసులు ఎక్కువగా వస్తున్నాయి. వైద్య సేవలందిస్తున్నాం. మందులు అందిస్తున్నాం. పుష్కలంగా మందులు ఉన్నాయి. పీహెచ్‌సీ ఆవరణలో ఉపాధి హామీ పథకంలో చదును చేయడానికి ప్రతిపాదించాం.

– తిరుపతిరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, కశింకోట

రాయితీపై పశువుల దాణా

కశింకోట: పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా సరఫరా చేస్తున్నామని పశు వైద్యాధికారి ఆల్వాన్సా జార్జ్ తెలిపారు. మండలంలోని జెట్టపురెడ్డి తునిలోని పశువైద్య కేంద్రంలో పది గ్రామాలకు చెందిన పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాయితీపై బుధవారం దాణా పంపిణీ చేశారు. 50 కిలోల బస్తా రూ.1150 కాగా, దీన్ని రాయితీపై రూ. 550కి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్పీ జిల్లా అధ్యక్షునిగా గురవయ్య



అనకాపల్లి: సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షునిగా కోన గురవయ్యను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ పార్టీ ఆదేశాలు మేరకు జిల్లాలో అక్రమ మైనింగ్, ప్రభుత్వ భూముల దోపిడీపై శక్తివంచన లేకుండా పోరాటాలు చేస్తామన్నారు.

రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలి



ప్రచార కార్యక్రమంలో సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల మధ్య పిల్లలను అక్రమ రవాణా చేయడానికి తరచూ రైల్వేలను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎవరికైనా నష్టం జరిగితే వెంటనే సంబంధిత రైల్వే పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు వి. సన్యాసిరాజు, కె.వి. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన

అనకాపల్లి: పట్టణంలోని ఏఎంసీ కాలనీలో కల్యాణ మండపం, సచివాలయం మేడపైన సామాజిక భవనం ఏర్పాటు చేసేందుకు 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆదేశాలు మేరకు స్థల పరిశీలన చేసినట్టు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తెలిపారు. కాలనీలో జీవీఎంసీ పబ్లిక్ వర్కర్స్ అధికారులతో బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భవనాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో స్థల సేకరణ ఆగిపోయిందన్నారు. స్థానికుల కోరిక మేరకు భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఏఎంసీ కాలనీ వాసులు రైల్వే గేటు దాటుతూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఏఎంసీ కాలనీ నుంచి లక్ష్మీదేవిపేట రైల్వే గేటు మధ్య ఎల్లయ్య కాలువపై చిన్నపాటి వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్కర్స్ అధికారి కుమార్, 5వ సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శి గణేష్, మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, పార్టీ నాయకులు బండి ఆనంద్, గోవింద్, రెడ్డి చిన్న, కటారి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జాజుల రమేష్, జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ అధికారులు

పెరుగుబజార్ రోడ్డు నిర్మించాలని నిరసన

అనకాపల్లి టౌన్: అసంపూర్తిగా నిలిచిపోయిన పెరుగుబజార్ జంక్షన్ రహదారిని తక్షణమే నిర్మించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. బుధవారం పెరుగుబజార్ జంక్షన్ రోడ్ వద్ద అసోసియేషన్ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 అడుగుల ఉన్న రహదారిని గత ప్రభుత్వం 55 అడుగుల వెడల్పుతో నిర్మాణాన్ని చేపడితే ఇప్పటి కూటమి ప్రభుత్వం దానిని పట్టించుకోవడం మానేసిందన్నారు. దీనివల్ల ఈ రహదారిపై ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు వచ్చేటప్పుడు గోతుల్లో నీరు చేరి ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. పాలకులు ఈ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టాలని కోరారు. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

పీఎంఎస్‌వై బీమా చెక్కు అందజేత



రూ.2 లక్షల చెక్కును అందిస్తున్న మేనేజర్ సత్యనారాయణ

తుమ్మపాల: గతేడాది బెంగుళూరులో జరిగిన లారీ ప్రమాదంలో మృతి చెందిన కాపుశెట్టి సాధుబాబు కుటుంబ సభ్యులకు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ బుధవారం రూ.2 లక్షల చెక్కును అందించారు. మండలంలో రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెం గ్రామానికి చెందిన సాధుబాబు అనకాపల్లిలోని ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో ఖాతా కలిగి ఉన్నాడు. ఏటా ప్రధానమంత్రి సురక్ష యోజన ప్రీమియం చెల్లించేవాడు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా మంజూరైంది. ప్రతి ఒక్కరూ బీమా ప్రీమియం చెల్లించాలని, కుటుంబ సభ్యులకు బాసటగా నిలవాలని మేనేజర్ కోరారు. మృతుడు సాధుబాబు అవయవ దానం చేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏబీఎం హరిశంకర్, బ్యాంక్ మిత్ర కోన నాయుడు పాల్గొన్నారు.

గురుకులంలో మౌలిక వసతులు కరువు



విద్యార్థుల భోజనం తీరును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అస్తవ్యస్తంగా బాత్‌రూమ్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కరువయ్యాయని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు రాయిరాజు ఆరోపించారు. బుధవారం స్థానిక పార్టీ నాయకులతో ఆయన పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహారంలో నాణ్యత లోపించిందన్నారు. బాత్‌రూములు అధ్వానంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం. నాయుడు, సోషల్ మీడియా కో-కన్వీనర్ శ్రీకాంత్, కొంకి శ్రీరామమూర్తి, కాండ్రేగుల రాము, జోగిరాజు, కార్తిక్, వంశీ, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: వసతి గృహ విద్యార్థులకు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అండగా ఉంటుందని, ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాయి రాజా, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తెలిపారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ చిన్నబాబు కాలనీ సమీపంలో ఇంటర్ టూ పీజీ మహిళా వసతి గృహంలో బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు బొధపు హరికృష్ణ, నాయకులు కాండ్రేగుల హైమావతి, రమ్య, పలకా వాసు, శ్రీకాంత్, తంగెళ్ల రామకృష్ణ, మడక కార్తీక్, డొంక సత్తిబాబు, కోలా గణేష్, అయినవిల్లి శివ, డొంక భాను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ప్రజల్లోకి వెళ్దాం



కుమార్‌రాజా, భరత్‌కుమార్‌లను సన్మానిస్తున్న దిలీప్‌కుమార్, జానకీరామరాజు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలపై ప్రజలకు వివరించడానికి గ్రామ స్థాయిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాల ఊసేలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు రైతు భరోసా పథకం కింద రూ.7,500 వారి రైతు బ్యాంకు ఖాతాలో జమ చేసేవారమని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రజలు నమ్మడం లేదని 2024 జూన్ నుంచి ఒక్కొక్క ఇంటికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు సంక్షేమ పథకాలు ద్వారా అందజేస్తామని బాండ్లను టీడీపీ నేతలు ఇంటింటికి పంపిణీ చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో కొంతమందికి మాత్రమే ఇచ్చారని, ఇంకా అర్హులైన వారు ఉన్నప్పటికీ ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పించుకుంటున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన లబ్ధిదారులకు వలంటీరు వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. కూటమి పాలనలో సంక్షేమ పథకాలు గురించి ఎవరిని అడగాలో అర్థంకాక ప్రజలు తలలు పట్టుకుంటున్నట్లు వాపోయారు. అనకాపల్లి మండలంలో గురు, శుక్ర, పట్టణంలో శని, ఆది, కశింకోట మండలంలో సోమ, మంగళవారాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా రచ్చబండ కార్యక్రమం ద్వారా సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు 40 సంవత్సరాల రాజకీయ జీవితం సరిపోలేదన్నారు. నేటి వరకూ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకుని ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారం చేపట్టారన్నారు. రానున్న గ్రామీణ స్థాయి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు జోష్యం చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రచారంలో టీడీపీ నాయకులు బాకా కొడుతున్నారని ఎద్దేవా చేశారు. అంతకు ముందు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన దంతులూరి దిలీప్‌కుమార్‌ను శాలువాలతో మలసాల భరత్‌కుమార్, పార్టీ శ్రేణుల సత్కరించారు. సమావేశం అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా జన్మదినం పురస్కరించుకుని పార్టీ సీనియర్ నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయి కిరణ్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, వైస్ ఎంపీపీ అయితా రాము, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం. నాయుడు, సీనియర్ నాయకులు కొణతాల మురళీ కృష్ణ, బొడ్డేడ శివ, నాయకులు విల్లూరి చంద్రశేఖర్, సిద్ధార్థ, జ్ఞానదీప్, బాదం హరికృష్ణ, నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు వరం.. భవిత కేంద్రం



భవిత కేంద్ర బాలలు, తల్లిదండ్రులతో అనకాపల్లి జిల్లా సహితవిద్య సమన్వయకర్త కృష్ణంనాయుడు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యాభివృద్ధి పథకాలను భవిత కేంద్ర బాలలు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా సహితవిద్య సమన్వయకర్త బీఆర్‌వీఆర్ కృష్ణం నాయుడు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించి బాలల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతనం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ తల్లిదండ్రుల భాగస్వామ్యం విద్యార్థుల ప్రగతికి ఎంతో కీలకమన్నారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా భవిత కేంద్రంలో అందిస్తున్న డిజిటల్ లెర్నింగ్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, ప్రత్యేక శిక్షణ, ఎస్ఎస్ఏ ద్వారా ట్రాన్స్‌పోర్టు, రీడర్ అలవెన్స్, ఎస్కార్ట్, హోమ్‌బేస్డ్ అలవెన్స్, ఫిజియోథెరపీ సేవలను వివరించారు. ది లూమోన్ స్టోర్ కంపెనీ వ్యవస్థాపకులు తమ మొదటి లాభం నుంచి దివ్యాంగ బాలలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో లూమోన్ స్టోర్ ఫౌండర్లు వి.కృష్ణవంశీ, వి.రాజశేఖర్, వై.ఉమామణిదీప్, టి.పవన్‌కుమార్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.